సికింద్రాబాద్ స్థూపానికి 200 ఏండ్లు

● లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో నేడు పాలాభిషేకం

సికింద్రాబాద్/బేగంపేట్, జూలై 30: సికింద్రాబాద్ నగరం ఏర్పడి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం స్థూపానికి లష్కర్ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేయనున్నట్లు అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుద్ధభవన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ స్థూపాన్ని 2006లో అప్పటి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు పాలాభిషేకం చేయనున్నట్లు పవన్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

2006లో సికింద్రాబాద్ నగరానికి 200 ఏండ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వేడుకల ను వారం రోజులపాటు ఘనంగా నిర్వహించింది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాజరై రూ. 200 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని కూడా ప్రకటించారని గుర్తు చేశారు. ఆ నిధులతో సికింద్రాబాద్ నగరంలో పలు అభివృద్ధి పనులు చేపడుతామని హమీ ఇచ్చారని పవన్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అయితే వైఎస్ఆర్ మరణాంతరం ఏ ఒక్క అధికారి గాని, ప్రజాప్రతినిధి గానీ పట్టించుకోక పోవడంతో సికింద్రాబాద్ నగరం వివక్షకు గురవుతున్నదని అన్నారు. నేటి పాలకులైనా పట్టించుకుని సికింద్రాబాద్‌కు న్యాయం చేయాలని స్థూపానికి పాలాభిషేకం చేసి ప్రభుత్వం దృష్టికి తీసికెళ్లేందుకు పవనకుమార్ గౌడ్ తెలిపారు.

బుద్ధభవన్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన స్థూపం

ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలి

సికింద్రాబాద్ ప్రాంత అభివృద్ధికి మద్దతుగా నిలిచే ప్రతి ఒక్కరూ బుధవారం ఉదయం 11 గంటలకు బైబిల్ హౌస్ వై జంక్షన్ వద్ద పాలాభిషేకం కార్యక్రమంలో పాల్గొనాలని లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు పవన్ కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు.

బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి

హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్, జూలై 30: బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని సికింద్రాబాద్ బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను కాలయాపన చేయకుండా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పీ. రవిప్రసాద్ గౌడ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, బీసీ సబ్‌ప్లాన్‌కి తగిన నిధులు మంజూరు చేయాలని అన్నారు. గొల్ల కురుమలకి రెండో దశ గొర్రెల పంపిణీ చేయాలని కోరారు. మత్స్యకారులకు, గంగపుత్ర, మున్నూరు కాపు, గౌడ, ముదిరాజ్, పద్మ శాలి, చాకలి, మేదరి తదితర బీసీ కులాలకు కేంద్రం ప్రవేశపెట్టిన విశ్వ కర్మ యోజన పథకాన్ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

మంత్రి కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నం

● అడ్డుకున్న పోలీసులు ● మంత్రివి అసత్య ఆరోపణలు : టీఎస్‌యూటీ

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న నల్గొండ అంజి, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: అసెంబ్లీ సాక్షిగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్(టీఎస్‌యూటీ) రాష్ట్ర అధ్యక్షుడు నల్గొండ అంజి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా అంజి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం సిగ్గుచేటన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని తీసుకువచ్చిన ఘనత జగదీశ్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించారని కొనియాడారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి అయిన తరువాత జిల్లాకు ఏం చేశాడో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తాము శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు వడ్డేపల్లి సందీప్, మేకల సందీప్, వెంకట్, గణేశ్, శివ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకు క్షేత్రస్థాయి కమిటీలు

జూబ్లీహిల్స్, జూలై 30: బీసీల హక్కుల సాధనకు క్షేత్రస్థాయి కమిటీలను సంఘటితం చేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీసీ సాధికారిక సంఘం అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 133 బీసీ కులాల ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బీసీలను ఒక్కతాటిపైకి తీసుకురావడానికి అన్ని సంఘాలు తమవంతు కృషి చేయాలన్నారు. బీసీ సంఘాలను బలోపేతం చేసేందుకు గ్రామ, వార్డు స్థాయిలలో కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల ప్రతినిధులు భాస్కర్ రావు, మహేందర్, చంద్రశేఖర్, వెంకటేశ్, లక్ష్మీ, తిరుమల దేవి, కోల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

మారేడ్‌పల్లి, జూలై 30: మారేడ్‌పల్లి మైసమ్మ ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు చిర్రబోయిన కృష్ణయాదవ్, వైష్ణవి యాదవ్ తదితరులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు నందిని వెల్లడించారు. బోనాల పండుగ మన సంస్కృతి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సురవి శ్యాంసుందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫలహార బండ్ల ఊరేగింపు

మారేడ్‌పల్లి, జూలై 30: మారేడ్‌పల్లిలోని పిట్ల బస్తీలో ఆలయ కమిటీ నిర్వాహకులు రాము, రాకేశ్ ఆధ్వర్యంలో అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు కనులపండువగా జరిగింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిర్రబోయిన బద్రీనాథ్ యాదవ్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయన్ను శాలువాతో సత్కరించారు.

నగర గ్రంథాలయంలో బోనాల పండుగ

చిక్కడపల్లి, జూలై 30: టీఎన్జీవోస్ జిల్లా యూనియన్, సిటీ గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి నగర గ్రంథాలయ ప్రాంగణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి.

శిథిలాల తొలగింపు పట్ల స్థానికుల హర్షం

అమీర్‌పేట్ ఫిల్లీ స్వీట్స్ వెనుక వీధిలో దీర్ఘ కాలంగా పేరుకుపోయిన శిథిలాలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. కాగా ఇదే కాలనీకి చెందిన హర్దీప్ సింగ్, అశోకానంద్ సరస్వతి డెబ్రిస్ తొలగించాలని పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం డెబ్రిస్‌ను తొలగించేందుకు జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం పర్యవేక్షకులు మహ్మద్ ఇంతియాజ్, నాగేందర్ పొక్లెయినర్ సాయంతో శిథిలాలను పూర్తిగా తొలగించారు. దాంతో హర్దీప్‌సింగ్, అశోకానంద్ సరస్వతి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.
– అమీర్‌పేట్, జూలై 30

తెలంగాణ ఉద్యమకారులకిచ్చిన హామీలను నెరవేర్చాలి


సీతాఫల్‌మండి చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యమకారులు

సికింద్రాబాద్, జూలై 30: తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ (టీయూఎఫ్) సభ్యుడు, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాంబాబు ముదిరాజ్ అన్నారు. టీయూఎఫ్ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రాంబాబు ముదిరాజ్ అధ్వర్యంలో కమిటీ సభ్యులు దయానంద్ గంగపుత్ర, లక్ష్మణ్,నర్సింహాచారి, అనిల్‌కుమార్, జగన్, శ్యామరావు, జగదీశ్, జానకీరామ్, భూపాల్ సీతాఫల్‌మండి చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, గుర్తింపు కార్డు ఇస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఈమేరకు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటన చేయాలని వారు కోరారు.

యూనివర్సిటీల్లో సమస్యలు పరిష్కరించండి..

మంత్రి దామోదర్ రాజనర్సింహకు పుష్పగుచ్ఛం అందజేసి సమస్యలను విన్నవించిన విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని, వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇన్‌చార్జి వీసీల పాలనలో అకడమిక్, పరిశోధనా పరమైన అభివృద్ధి కుంటుపడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతోపాటు పాలనాపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇన్‌చార్జి వీసీలుగా ఉన్న ఐఏఎస్ అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో విద్యార్థుల సమస్యలను పరిష్కరించే వారు కరువయ్యారని వాపోయారు. వీసీల నియామకంలో రాజకీయ జోక్యం లేకుండా అనుభవం ఉన్న వారినే పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు సురేశ్, వేణుగోపాల్, శివశంకర్, రాజు, రవి, శ్రీనివాస్,కుమార్,చందు,బాలు, వేణు, సూరి, అజయ్, ప్రశాంత్, మహేశ్, సంతోష్, ప్రవీణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వంజరి కులస్తుల రిజర్వేషన్ల పునరుద్ధరణకే జేఏసీ

రిజిస్టర్డ్ వంజరి సంఘాల సమావేశంలో సభ్యులు

నినదిస్తున్న వంజరి కుల జేఏసీ ప్రతినిధులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: వంజరి కులస్తుల రిజర్వేషన్ల పునరుద్ధరణే లక్ష్యంగా వంజరి కుల జేఏసీ ఏర్పడింది. వంజరి కులస్తులకు ఎస్టీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేసింది. తార్నాకలోని వంజరి భవన్‌లో 'వంజరి రిజర్వేషన్లు – భవిష్యత్తు కార్యాచరణ' అనే అంశంపై రాష్ట్రంలోని అన్ని రిజిస్టర్డ్ వంజరి సంఘాలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ శంకరన్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా వంజరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేరిస్తే వ్యక్తిగత కక్షలతో రాత్రికి రాత్రే ఒక చీకటి జీవో ద్వారా వంజరులను ఎస్టీ జాబితా నుంచి తొలగించి బీసీ 'డీ' జాబితాలో మర్రి చెన్నారెడ్డి చేర్చారని గుర్తు చేశారు. వంజరుల పట్ల చెన్నారెడ్డి మరణ శాసనం లిఖించారని ఆవేదన వ్యక్తం చేశారు. చెన్నారెడ్డి ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేసి వంజర్లను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి, తెలంగాణ వంజరి సంఘం మాజీ అధ్యక్షుడు కాలేరు విశ్వనాథం, వివిధ సంఘాల ప్రతినిధులు ముజకరి రవీందర్, పోతనకార్ లక్ష్మినారాయణ, మహాదేవ్ ముండే, కాలేరు రూపసురేశ్, ధాత్రిక ధర్మరాజు, ఎదుగాని హరినాథ్, పిట్టల అంజయ్య, ధాత్రిక కాశీనాథ్, కాలేరు యుగంధర్, అనంతుల అనిల్, కాలేరు శ్రీనివాస్, విఠల్, శ్రీనివాసరావు, భూమయ్య, సత్యం, శంకర్, రవీందర్, రత్నం, మహేశ్, ఆంజనేయులు, శ్రీనివాస్, రాజేందర్, బుచ్చిలింగం, లింగారెడ్డి పాల్గొన్నారు.

భార్యతో గొడవ పడి వ్యక్తి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జూలై 30: భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లాకు చెందిన కాలీ ఐలయ్య(67) కుటుంబ సభ్యులతో కలిసి పదేండ్ల క్రితం బాలాజీనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. ఐలయ్యకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. అయితే కొన్ని రోజులుగా భార్యభర్తల మధ్య చిన్నచిన్న తగాదాలు జరుగుతున్నాయి. ఈనెల 29న రాత్రి ఐలయ్య ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లి ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఒకరు..

చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా అంబేద్కర్ కాలనీకి చెందిన వెంకటరమణ (45) ప్రైవేట్ జాబ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 29న రాత్రి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వచ్చి ప్లాట్‌ఫామ్ నెంబర్ 9లో వేచి ఉన్నాడు. అయితే ఆ రైలు 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైన ఉందని తెలియడంతో పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమైంది. వెంటనే 108 అంబులెన్స్ సిబ్బంది అతడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

శామీర్‌పేట,జూలై30: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్సీ విద్యార్థులు డిగ్రీలో చేరుటకు నేరుగా జగద్గిరిగుట్ట(శామీర్‌పేట) కళాశాలకు ఇంటర్ సర్టిఫికెట్లతో వచ్చి బీకామ్-సీఏ, బీకామ్-బీఏ, బీబీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్ గ్రూపుల్లో చేరాలని కోరారు.

వర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

పోస్టర్ విడుదల చేస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. వర్సిటీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ వర్సిటీలలో ఖాళీగా ఉన్న 82 శాతం టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేసి, ప్రతి విద్యార్థికి మెరుగైన హాస్టల్ వసతి కల్పించాలన్నారు. అంతేకాకుండా వర్సిటీల్లో అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజినీరింగ్ కోర్సుల ట్యూషన్, పరీక్షా ఫీజులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయడంతో పాటు పీహెచ్‌డీ స్కాలర్స్‌కు ఫెలోషిప్‌లు, అధునాతన లైబ్రెరీ, ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అన్యాక్రాంతమవుతున్న వర్సిటీ భూములను పరిరక్షించి, ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ పృథ్వీతేజ, ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రీహరి, కమల్ సురేశ్, రాజు, నాయకులు కోటి, దృహన్, రేవంత్, సాయి, రవికాంత్, శివప్రసాద్, చిరంజీవి, గణేశ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

● డీసీపీ సాధనరష్మి పెరుమాళ్

వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మి పెరుమాళ్

మారేడ్‌పల్లి,జూన్ 30: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నార్త్ జోన్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. మంగళవారం నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో డీసీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ నేరాల నియంత్రణకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు అపార్టుమెంట్, కాలనీ, బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా నేరం జరిగినపుడు నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. అదేవిధంగా వీధి దీపాలు, నివాసిత ప్రాంతాల్లో చెత్త వేయవద్దన్నారు. వీధి వ్యాపారులు పుట్‌పాత్‌లు, రోడ్లను అక్రమిస్తే సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలను ఇవ్వద్దని సూచించారు. ఇటీవల వీధి కుక్కల సమస్య తీవ్రంగా ఉందని, స్థానికంగా వీధి కుక్కలు ఉంటే వెంటనే జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. సీనియర్ సిటిజన్ల భద్రతపై జాగ్రత్తగా ఉండాలని అసోసియేషన్ ప్రతినిధులకు డీసీపీ సూచించారు. స్థానికంగా ఏలాంటి సమస్య తలెత్తినా తమ దృష్టికి తీసుకవస్తే పరిష్కారానికి కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

ఈ ఏడాది అంతా మంచే జరుగుతుంది..

గతంలో కంటే పూజలు ఇప్పుడు బాగానే జరుగుతున్నాయి.. ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడుతా.. అంతే మంచే జరుగుతుంది.. అని అమీర్‌పేట్‌లోని లక్ష్మీదుర్గ, సోనాబాయమ్మ దేవాలయం వద్ద సోమవారం రాత్రి మోహన్ రంగం భవిష్యవాణిని వినిపించారు. నర్సాపూర్ గుమ్మడిదల ప్రాంతానికి చెందిన మోహన్ అమ్మవారి ఆలయం ఎదుట పచ్చి కుండపై నిలబడి భవిష్యవాణి చెప్పారు. భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు మోహన్ సమాధానాలివ్వడంతో రంగం కార్యక్రమం ఆసక్తిగా సాగింది. వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు నిరంజన్, సభ్యులు డి.కృష్ణ, గొలుసుల సత్యనారాయణ, జి. బాబూరావు, ఎం. బాబు, సీ. కృష్ణ తదితరులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్, జూలై 30

ఆనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

బొల్లారం, జూలై 30: ఆనారోగ్యంతో బాధపడుతూ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుమలగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి అరుణ్ ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్న రాజలక్ష్మి(61)కి ఇద్దరు కుమారులు. సోమవారం రాత్రి మరో కుమారుడి ఇంటికి వెళ్తానని చెప్పి వెళ్లింది. మంగళవారం ఉదయం అరుణ ఎన్‌క్లేవ్‌లోని ఖాళీ స్థలంలో చెట్టుకు మహిళ ఉరివేసుకొని కనిపించడంతో స్థాని కులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కుమారులను ఇబ్బంది పెట్టకూడదనే ఆలోచనతో ఉరివేసుకొని మృతి చెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

ఐఐఐటీలో సీటు సాధించడం అభినందనీయం

విద్యార్థి వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న డాక్టర్ కోట నీలిమ

అమీర్‌పేట్, జూలై 30 : కార్పొరేట్ విద్యార్థులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చక్కటి ఫలితాలను సొంతం చేసుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ పేర్కొన్నారు. బేగంపేట్ పాటిగడ్డ కాలనీ బండిమెట్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో 9.7 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచిన విద్యార్థి వినయ్‌కుమార్ బాసరలోని ఐఐఐటీలో సీటు సాధించడం గొప్ప విషయమన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కోట నీలిమ విద్యార్థి వినయ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులను అభినందించారు. బాసర ఐఐఐటీలో ఇంటర్‌తో పాటు బీటెక్‌నూ ఉచితంగా పూర్తి చేసే అవకాశం లభించిందని ఆమె కొనియాడారు.

నిలోఫర్ దవాఖానకు రెటినో స్కాన్ పరికరం

తెలుగు యూనివర్సిటీ, జూలై 30: నిలోఫర్ దవాఖానలో చిన్న పిల్లల దృష్టిలోపాన్ని గుర్తించే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన వెల్‌షాలిన్ రెటినో స్కాన్ పరికరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ప్రైడ్ సభ్యులు హామీద్ సుల్తానా, ఫాతిమా మంగళవారం దవాఖాన ఆర్ఎంఓ డాక్టర్ జ్యోతి, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ అర్చనకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్చన మాట్లాడుతూ.. ఈ పరికరంతో తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో కంటి సమస్యలను కనుగొని వైద్యం అందించవచ్చని అన్నారు.

బీఈ రీవాల్యూయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో వివిధ కోర్సులకు సంబంధించి పరీక్షా ఫీజులను స్వీకరిస్తున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(హెచ్ఐ) మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 8 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని పేర్కొన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో 9 వరకు చెల్లించవచ్చన్నారు. ఎంబీఏ (సీబీఎస్ఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజులను వచ్చే నెల 8 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని తెలిపారు. రూ. 300 అపరాధ రుసుముతో 13 వరకు చెల్లించవచ్చని వివరించారు. పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. పూర్తి వివరాల